## ఉద్యోగ భద్రత కల్పించాలి



మాట్లాడుతున్న నాయకులు

ఉట్నూర్, డిసెంబర్ 18 : ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ టీచర్స్(సీఆర్టీల) ఉద్యోగ భద్రత కల్పించాలని పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కనక అభిమాన్ అన్నారు. బుధవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న రిలే దీక్షకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐటీడీఏ ఆధ్వర్యంలో నడుస్తున్న పాఠశాలలో సీఆర్టీలు కొన్నేండ్లుగా విద్యార్థులకు విద్యను అందిస్తున్నారన్నారు. కనీస సౌకర్యాలు కల్పించకపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోహన్ సింగ్, ఆడే నూర్‌సింగ్, నవీన్ యాదవ్, ప్రకాశ్, సునీల్, రవీందర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

## ఉపకార వేతనాలు అందించాలి

### అసెంబ్లీలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్




అసెంబ్లీలో మాట్లాడుతున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ఆదిలాబాద్, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ) : విదేశాల్లో చదువుతున్న గిరిజన విద్యార్థులకు ఉపకార వేతనాలు(ఓవర్సీస్ స్కాలర్‌షిప్) అందించాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం అసెంబ్లీ సమావేశాల ప్రశ్నోత్తర సమయంలో ఈ అంశాన్ని లేవనెత్తారు. కేసీఆర్ ప్రభుత్వం విదేశాల్లో ఉన్నత చదువుల కోసం విద్యార్థులకు ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌ను ప్రవేశ పెట్టిందన్నారు. ప్రస్తుతం స్కాలర్‌షిప్ అందకపోవడంతో వారి తల్లిదండ్రులు డబ్బులు బాకీలు చేస్తూ వడ్డీలు కడుతున్నారని సభ దృష్టికి తీసుకొచ్చారు. అదే విధంగా డిగ్రీ, ఇంటర్ విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందడం లేదని, వాటిని కూడా త్వరగా అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.



మంగళవారం ఉదయం పొగమంచు కప్పుకున్న ఇందారం శివారు ప్రాంతం



పొగమంచుతో కమ్ముకున్న సూర్యుడు

# చలి.. తగ్గదే లే

## ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాపై పంజా

- కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(యూ)లో రాష్ట్రంలోనే అత్యల్పంగా 5.9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు
- ఆదిలాబాద్ జిల్లా బేలలో 6 డిగ్రీలు, నిర్మల్ జిల్లా మామడలో 7.3 డిగ్రీలు
- బయటికి రావాలంటేనే వణుకుతున్న జనం
- ఆదిలాబాద్ జిల్లాలో స్కూళ్ల వేళలు మారుస్తూ కలెక్టర్ ఆదేశాలు



సిర్పూర్(యూ) : చలి మంటకాగుతున్న పిల్లలు, వృద్ధులు


మంచిర్యాల, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను చలి వణికిస్తున్నది. గడిచిన నాలుగైదు రోజుల్లో రాష్ట్రంలోనే అతి తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మధ్యాహ్నం సైతం వాతావరణం చల్లగానే ఉంటుంది. సాయంత్రం 6 గంటలయ్యిందంటే చాలు జనాలు బయటికి రావడం లేదు. ఉదయం 8 గంటల దాటాక కూడా వాతావరణం పొగమంచుతో కప్పి ఉంటుంది. నిత్యం జన సంచారం, వాహనాల రాకపోకలతో రద్దీగా కనిపించే రోడ్లు చీకటి పడిందంటే చాలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. తెలంగాణ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ(టీజీడీపీఎస్) ప్రకారం.. బుధవారం రాష్ట్రంలోనే అత్యల్పంగా కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(యూ)లో 5.9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదిలాబాద్ జిల్లా బేలలో మంగళవారం 5.8 డిగ్రీల ఉష్ణోగ్రత ఉంటే, బుధవారం 6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇక నిర్మల్ జిల్లా మామడ మండలం తండ్రా గ్రామంలో 7.3 డిగ్రీలు, మంచిర్యాల జిల్లా జన్నారం మండలం తపాల్‌పూర్‌లో 9.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రంలోని టాప్ 15 జిల్లాల్లో నాలుగు జిల్లాలు ఉమ్మడి ఆదిలాబాద్ నుంచే ఉన్నాయంటే ఇక్కడ చలి తీవ్రత ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

### మరింత పడిపోనున్న ఉష్ణోగ్రతలు

ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో దక్షిణ బంగాళఖాతంలోని మధ్య ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడిందని, ఫలితంగా రానున్న రెండు, మూడు రోజులు ఉమ్మడి జిల్లాలో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఒక్కసారిగా వాతావరణంలో వచ్చిన మార్పుల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. అత్యవసరమైతేగానీ బయటికి రాకూడదని, తెల్లవారుజామున, రాత్రి వేళ బయటికి వస్తే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు. ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(యూ), తిర్యాణి మండలాల్లో అతి తక్కువ నాలుగు నుంచి ఐదు డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలు ఉన్నాయి.

### స్కూళ్ల వేళల్లో మార్పులు..

ఆదిలాబాద్ జిల్లాలో చలి తీవ్రత దృష్ట్యా ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్ల పని వేళలను మార్పు చేస్తూ కలెక్టర్ రాజర్షిషా బుధవారం ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటి వరకు ఉదయం 9.15 గంటల నుంచి సాయంత్రం 4.15 గంటల వరకు ఉండగా, ప్రస్తుతం ఉదయం 9.40 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటలక మారుస్తున్నట్లు పేర్కొన్నారు. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు మార్చిన సమయాన్నే కొనసాగించాలని స్పష్టం చేశారు. ఈ మేరకు డీఈవో, ఎంఈవోలు, ఉన్నత పాఠశాలల ప్రధాన ఉపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశారు.




## సమస్యలను పరిష్కరించాలి

- సీఎంకు ఎమ్మెల్యే అనిల్ జాదవ్ వినతి

ఆదిలాబాద్, డిసెంబర్ 18(నమస్తే తెలంగాణ) : బోథ్ నియోజకవర్గ సమస్యలను పరిష్కరించాలని స్థానిక ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. బుధవారం హైదరాబాద్‌లో సీఎంను కలిసి వినతిపత్రం అందజేశారు. బోథ్‌ను రెవెన్యూ డివిజన్‌గా మార్చాలని, జనరల్ డిగ్రీ కళాశాలతోపాటు ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలని, కుప్టి ప్రాజెక్టు పనులు ప్రారంభించాలని కోరారు. భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి ప్రాజెక్టు భూ నిర్వాసితులకు పరిహారం అందజేయడంతోపాటు ఇచ్చోడలో పోలీస్ సబ్ డివిజన్, తలమడుగు మండలంలోని బరంపూర్ నుంచి మార్కండీ రోడ్డు, సిరిచెల్మ, పెంబి రహదారి నిర్మాణానికి అటవీశాఖ అనుమతులు ఇప్పించాలని, సిరిచెల్మ మల్లికార్జుల ఆలయం, బరంపూర్ వెంకటేశ్వర ఆలయానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. దేగామా ప్రాజెక్టు కింద భూములు కోల్పోయిన వారికి పునరావాసం కల్పించాలని కోరారు.



సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

## నీటిని విడుదల చేయాలి

- బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్



కడెం ప్రాజెక్టు నుంచి ర్యాలీగా వెళ్తున్న జాన్సన్‌నాయక్, కార్యకర్తలు, రైతులు

కడెం, డిసెంబర్ 18 : కడెం ప్రాజెక్టు ఆయకట్టు రైతాంగానికి యాసంగి సాగు కోసం నీటిని విడుదల చేయాలని బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భుక్యా జాన్సన్ నాయక్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన కడెం, దస్తురాబాద్, జన్నారం మండలాలకు చెందిన రైతులతో కలిసి ప్రాజెక్టును సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టులో ప్రస్తుత నీటి పరిస్థితిని సమీక్షించిన అనంతరం ర్యాలీగా నీటి పారుదలశాఖ కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం ఆయకట్టు అధికారులతో మాట్లాడి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెప్టెంబర్‌లో కోతలు పూర్తి చేసిన రైతులకు యాసంగి పంట గురించి ప్రభుత్వం, నీటి పారుదలశాఖ అధికారులు స్పష్టమైన హామీ ఇవ్వకపోవడంతో రెండో పంట విషయమై సందిగ్ధంలో ఉన్నారని అన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా కడెం, దస్తురాబాద్, జన్నారం మండలాల పరిధిలోని డిస్ట్రిబ్యూటరీ-33 వరకు సాగు నీటిని అందించాలని డిమాండ్ చేశారు. రెండో పంట విషయమై నవంబర్‌లోనే రైతులతో సమావేశం నిర్వహించి, పంటకు వారబందీ పద్ధతిన ఇవ్వాల్సి ఉండగా, నేటికి స్పష్టమైన హామీ ఇవ్వకపోవడంపై రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డిసెంబర్ ముగుస్తున్నా నేటికి అధికారులు సమావేశం ఏర్పాటు చేయక, నీటి విడుదలపై స్పష్టత ఇవ్వకపోవడం సరికాదని అన్నారు. ఇకనైన అధికారులు రైతులతో సమావేశం నిర్వహించి రెండో పంటకు నీటిని విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కడెం మండల అధ్యక్షుడు నల్ల జీవన్‌రెడ్డి, జిల్లా నాయకుడు భుక్యా బాపురావు, జిల్లా కో-ఆప్షన్ సభ్యుడు రఫీక్ హైమద్ పాల్గొన్నారు.



నీటి పారుదలశాఖ కార్యాలయంలో రైతులు, నాయకులతో వినతిపత్రాన్ని అందజేస్తున్న జాన్సన్ నాయక్



మూతికి మాస్కు పెట్టుకొని నిరసన తెలుపుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

## చర్చల పేరిట కాలయాపన

- మంత్రుల ముఖచిత్రాలతో ఉద్యోగుల నిరసన

నిర్మల్ అర్బన్, డిసెంబర్ 18 : రాష్ట్ర ప్రభుత్వం చర్చల పేరిట కాలయాపన చేస్తున్నదని సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆవేదన వ్యకం చేశారు. తమ న్యాయమైన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చూస్తూ నిర్మల్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట చేపడుతున్న నిరవధిక సమ్మె బుధవారం నాటికి తొమ్మిదో రోజుకు చేరుకున్నది. రాష్ట్రవ్యాప్త సమ్మెలో భాగంగా ఉద్యోగ, ఉపాధ్యాయులు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం, పంచాయతీ రాజ్ మంత్రుల ముఖచిత్రాలను ధరించి జాతీయ రహదారిపై నిరసన వ్యక్తం చేశారు.

## వసతి గృహాల్లో సదుపాయాలు కల్పించాలి

ఎదులాపురం, డిసెంబర్ 18 : రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీ-యింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏగ్రాజీ హరీశ్, మడావి గణేశ్ అన్నారు. పీడీఎస్‌యూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలాదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు దీపలక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శి దత్తు, కోశాధికారి నాగేందర్. జిల్లా నాయకులు ఆరీఫ్, శ్రీకర్, భీమ్‌రావ్, పీవైఎల్ జిల్లా నాయకులు మారుతి తదితరులు పాల్గొన్నారు.

## అటవీశాఖ అధికారుల అదుపులో మేకల కాపరి

- కార్యాలయం ఎదుట ఆదివాసుల ధర్నా
- నీలుగాయిని వేటాడాడని విచారణ కోసం తీసుకొచ్చాం : ఎఫ్ఆర్వో

ఎదులాపురం, డిసెంబర్ 18 : వన్యప్రాణుల వేట పేరిట అమాయక గిరిజనులను అటవీశాఖ అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని తుడుం దెబ్బ రాష్ట్ర నాయకులు గోడం గణేశ్ అన్నారు. బుధవారం అటవీ శాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అటవీ శాఖ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తు హోరెత్తించారు. విషయం తెలుసుకున్న వన్ టౌన్ ఎస్ఐ ఇసాక్ సిబ్బంది కలిసి అక్కడి చేరుకుని కార్యాలయంలోకి వెళ్లకుండా గేట్లను మూసి వేశారు. ఈ సందర్భంగా గోడం గణేశ్ మాట్లాడుతూ.. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని సిరికొండ గ్రామానికి చెందిన మేకల కాపరి మడావి రామకృష్ణని జంతువును వేటాడాడనే నెపంతో ఉదయం తీసుకొచ్చి నీరు, ఆహారం ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టారన్నారు. అటవీ శాఖ అధికారులను బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై ఎఫ్ఆర్వో గులాబ్ సింగ్ వివరణ ఇచ్చారు. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని సిరికొండ గ్రామానికి మేకల కాపరి నీలుగాయిని వేటాడాడని తమకు అజ్ఞాత వ్యక్తి సమాచారం ఇచ్చారన్నారు. దీని ఆధారంగానే మడావి రామకృష్ణని విచారణ నిమిత్తం తీసుకొచ్చామన్నారు. విచారణలో జగన్నాథ్ స్టేట్‌మెంట్ తీసుకున్నామని తెలిపారు. విచారణ సమయంలో ఆదివాసీ సంఘాల నాయకులు ఆందోళనలు చేయడం సరికాదన్నారు. బలవంతంగా ఎవరిపై కూడా కేసులు నమోదు చేయమని స్పష్టం చేశారు. విచారణలో తప్పు చేసిన వారిపై చర్యలుంటాయని పేర్కొన్నారు. ధర్నాలో తుడుం దెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి వేట్టి మనోజ్, కొల్లామ్ సంఘం రాష్ట్ర నాయకులు కొడప సోనేరావు, జిల్లా విద్యార్థి సంఘం ఉపాధ్యక్షుడు ఆదిలాబాద్ సలాం వరుణ్, రైతు సంఘం డివిజన్ అధ్యక్షుడే ఆత్రం బుజంగ్ రావు, మావల మండల అధ్యక్షుడు మేడమా ముకుంద్, మడవి బాపూరావు, మెస్రం దినేశ్, గేడం ఆనంద్, గేడం గణేశ్ ఉన్నారు.



అటవీ శాఖ కార్యాలయం గేటు ఎదుట ధర్నా చేస్తున్న తుడుం దెబ్బ నాయకులు